# 13 అరివత్తయ్య నాయనారు

చోళ రాజ్యంలో కన్నమంగళంలో తాయనార్ అనే మంచి వెల్లాల గృహస్థువుండే వాడు. గృహస్థ ధర్మాలను చక్కగా పాటించేవాడు. తిరువళ్లువారు నుడివినది ఈయన ఎడ సత్యమే.

యుక్తరీతి ధర్మ యుక్తుడౌ గృహమేధి
యజ్ఞ యాగ ఫలములనుభవించు
బ్రదుక వలసినట్లు బ్రదికినచో నింట
మింట సురలు బిలిచి మెత్తు రతనిని - (కురాల్)

నాయనారు నిష్టాగరిష్టుడయిన శివభక్తుడు. అనుదినము ఎర్ర బియ్యముతో అన్నము వండించి, ఎర్ర మూలికలతో చారు కాయించి మామిడి వూరగాయతో శివునికి నివేదనము గావించెడివాడు. మహేశ్వరునికి ఈయన నివేదన సంతుష్టి కలిగించినది. ప్రపంచానికి ఈతని నిష్టా విశేషములు చూపదలిచాడు. శివసంకల్పముతో నాయనారు ఆర్థిక దుస్థితికి లోనయ్యాడు. తాయనారు తనకు ఎర్ర బియ్యము వేతనముగా చెల్లించెడి పద్ధతిని ఉద్యోగములో చేరాడు. తను ఆ ఎర్ర బియ్యము తినడు. ఖరీదు తక్కువైన కార బియ్యముతోనే తాను సరిపెట్టుకునేవాడు. శివునికి నివేదనమునకు ఎర్ర బియ్యము వుంటే చాలును. దానితో సంతృప్తి నొందేవాడు.

శివుడు ఇంకా పరీక్షించదలచుకున్నాడు. అన్ని భూములలోనూ ఎర్రబియ్యమునే అందరూ పండించ మొదలుపెట్టారు. అతని భార్య తోటలోని ఆకుకూరలను వండి పెట్టడం మొదలుపెట్టింది. శివునికి యధాస్థితి ఎర్రబియ్యముతోనే నివేదన జరిగేది. శివుడు ఇంకా పరీక్ష పెట్టదలచాడు. తోటలో ఆకుకూర ఎండిపోజొచ్చింది. నాయనారుకు తన స్వంత పచనమునకు ఏమియు మిగులలేదు. నాయనారు దిగులు చెందలేదు. వట్టి మంచినీళ్లు తాగి పొట్ట నింపుకోవడం మొదలుపెట్టాడు. శివునికి నివేదన ఇచ్చుచున్నా

నన్న భావనతో తన ఆకలిదప్పికలను మరచాడు. నాయనారు బక్కచిక్కిపోయాడు. దేవునికి నివేదనము చేస్తూ నీరసమున మెలిదిరిగి పడిపోయాడు. తను దేవునికిచ్చే నివేదనము నేలమీద పడింది. నాయనారుకు మతిపోయినట్లయింది. బిగ్గరగా ఏడ్చాడు. పరమేశ్వరా! నీకై తయారుచేసింది నేలపాలయింది. నేనేం అపరాధం చేశాను? ఇలా జరిగింది. నన్ను క్షమించు. నాపై కరుణ జూపు. నీవు సర్వసమర్థుడవు. సర్వజ్ఞుడవు. సర్వాంతర్యామివి. ఈ విషయము నిజమైతే నీవు ఈ నేల మీద గూడ నున్నట్లే. వచ్చి ఇక్కడున్న నివేదనను గ్రహించు. నీవు అట్లు చేయనిచో నేను ప్రాణమును త్యజించెదను అంటూ తన కంఠము కొడవలితో నుత్తరించుకోబోయాడు. ఈ పని మూలాన్ని ఈయనకు అరివత్తయ్యనాయనారు అనెడి పేరు వచ్చింది.

శివుడు తన లీలను అంతటితో ఆపాడు. తన చేయి చాచి నాయనారు చేతిని పట్టుకొని నాయనారు తన కంఠమునుత్తరించుకోకుండా ఆపాడు. నాయనారుకు ఏమి జరుగుచున్నదో అర్థము కాలేదు. ఆవకాయ ముక్క కొరుకుతున్న శబ్దము వినిపించింది. దేవుని లీల నాయనారుకు అర్థమయింది. అవగతమయింది. దేవుని గురించి నృత్యము చేస్తూ వినుతిస్తూ పాడాడు. పార్వతీపరమేశ్వరులు ప్రత్యక్షమై ఆశీర్వదించారు.

“మాననీయుడా! నీ అనితరభక్త్యావేశము నన్ను పరవశింపజేసింది.నీవు, నీభార్య అనతికాలములోనే నా లోకానికి వచ్చి శాశ్వతంగా నా దగ్గర వుండండి” అని శివుడు పలికి పార్వతితో అంతర్థానమైపోయాడు.

****